

పలుకే బంగారమాయే

పెళ్లిళ్ల వేళ పసిడి ధర చుక్కలు చూపిస్తుండడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు.

వివరాలు 8లో ►



ఆస్తి, కుటుంబ తగాదాలే...

ఆస్తి, కుటుంబ తగదాలతో అన్న కొడుకే బాబాయ్‌ని పథకం ప్రకారం హత్య చేశాడు.

వివరాలు 8లో ►



అలంకారప్రాయంగా కాంప్లెక్స్

రైల్వేస్టేషన్ కమర్షియల్ కాంప్లెక్స్ పనులు ఆగిపోవడంతో అలంకారప్రాయంగా మారింది.

వివరాలు 9లో ►

న్యూస్‌రీల్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రామచంద్రాపురం పట్టణంలో ఓబీసీ సంఘం నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. కార్యక్రమంలో పర్సా శ్యాంరావు, ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌గౌడ్, ఈశ్వర్ కపూర్, హబీబ్‌జానీ, శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌ను గెలిపించండి



సదాశివపేటలో ఎన్నికల కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నేత అశోక్‌ను గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిలు, టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఆర్. కిష్టయ్య కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. బుధవారం ఈ సంఘాల నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, ఉద్యమంలో ఉండి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని, ఆయన్ను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షులు శంకర్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు కే. శివశంకర్, ప్రధాన కార్యదర్శి ఎన్. నర్సింలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం జహీరాబాద్ మండలంలోని నలుగురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్‌నాయకులు రూ.1,03,500 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బుర్దిపాడ్‌కు చెందిన ధర్మారెడ్డికి రూ.30 వేలు, అర్జున్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ సంతోశ్‌కు రూ.18 వేలు, సత్వార్‌కు చెందిన యాసీన్‌కు రూ.60 వేలు, హోతి(కె) గడక్‌తండాకు చెందిన సంతోశ్ చౌహాన్‌కు రూ.25,500 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టునారాయణ, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, నాయకులు ప్రభుయాదవ్, రాములు, హీరురాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్: స్వయం ఉపాధి పథకాల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ హేమ భార్గవి తెలిపారు. మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు 25 యూనిట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. కాగా ఈనెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడంతో పాటు దరఖాస్తు పత్రాలను ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

నేడు నర్సాపూర్ పట్టణ బంద్

నర్సాపూర్: గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేసిన డంప్‌యార్డును ఎత్తివేయా లని నర్సాపూర్ అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా వా రు మాట్లాడుతూ.. డంప్‌యార్డును ఎత్తి వేయాలనే డిమాండ్‌తో గురువారం నర్సాపూర్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. పట్టణంలోని అన్నివర్గాల వ్యాపారులు, ప్రజలు రాజకీ యాలకు అతీతంగా బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు రమణారావు, నగేష్, రమేష్ యాదవ్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

మనకు మహాకంపు

ప్యారానగర్‌లో హెచ్‌ఎండీఏ డంపింగ్‌యార్డు

- హైదరాబాద్ మహానగరంలోని చెత్త ఇక్కడికే
- రోజుకు సుమారు 19 వేల టన్నులు తరలింపు
- ఈ చెత్తతో బయోగ్యాస్, విద్యుత్ తయారీ యూనిట్
- ప్యారానగర్, పరిసర గ్రామాల వాసుల ఆందోళన



ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న స్థానికులు, అఖిలపక్ష నాయకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టుపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలో ప్రతీరోజు సుమారు 7,500 టన్నుల చెత్త ఉత్పత్తి కాగా... ఇందులో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్ల పరిధిలో నిత్యం ఉత్పత్తి అయ్యే సుమారు 1,900 టన్నుల చెత్తను ప్యారానగర్ డంపింగ్ యార్డుకు తరలించనున్నారు. ఈ డంపింగ్‌యార్డుతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పోరాటం చేస్తున్నారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్, నల్లవల్లి, మాంబాపూర్ తదితర గ్రామాలతోపాటు, మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే శివంపేట, నావపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అఖిలపక్షంగా ఏర్పడి ఈ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈ యార్డు నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను తరలించడంతో స్థానికుల్లో ఒక్కసారిగా నిరసనకు దిగారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారీ ఎత్తున మోహరించిన పోలీసులు నిరసన వ్యక్తం చేస్తున్న వారిని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

పచ్చని పంట పొలాల్లో

ఈ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తున్న ప్యారానగర్ చుట్టుపక్కల మొత్తం పచ్చని పంట పొలాలే ఉన్నాయి. వ్యవసాయమే జీవనాధారమైన మా పంట పొలాల్లో చెత్త డంపింగ్‌యార్డు పెట్టొదంటూ రైతులు వాపోతున్నారు. ఈ యార్డుతో వెలువడే కాలుష్యంతో చెరువులు, కుంటలే కాదు, భూగర్భ జలాలు కూడా కలుషితమై పంటలు పండించుకునే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పార్టీల మధ్య మాటల యుద్ధం

ఈ డంపింగ్‌యార్డు ఏర్పాటు విషయంలో రెండు పార్టీల స్థానిక నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ యార్డును ఏర్పాటు చేయడంపై బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారు. అయితే బీఆర్‌ఎస్ హయాంలోనే ఈ డంప్‌యార్డుకు పూర్తి అనుమతులిచ్చారని, ఈ ప్రభుత్వ భూమిని కూడా అప్పట్లోనే జీహెచ్‌ఎంసీకి కేటాయించిందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

ఇదీ ప్రాజెక్టు..

- ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న యార్డులో ప్రభుత్వం రెండు ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. ఒకటి బయోమెథనైజేషన్ ప్లాంటు. ఇందులో రోజుకు 500 టన్నుల వ్యర్థాలతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు.
- 24 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..ఈ యార్డులో 24 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో మరో యూనిట్‌ను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తోంది. 1,400 టన్నుల పొడిచెత్తను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఈ యూనిట్‌కు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వెలువడే పొగలోంచి వాయు కాలుష్య కారకాలను తొలగించి ఎత్తయిన చిమ్నీల ద్వారా పొగను బయటకు వదులుతుందని వివరించారు.



ఎమ్మెల్యే సునీతారెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

అర్ధరాత్రి హైడ్రామా

పోలీసు పహారాలో డంపింగ్‌యార్డ్ పనులు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు
- ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్
- వందల సంఖ్యలో పోలీస్, సీఆర్పీఎఫ్ బలగాల మోహరింపు
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు)/పటాన్‌చెరు టౌన్: గుమ్మడిదల మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. జీహెచ్‌ఎంసీ ప్యారానగర్‌లో 150 ఎకరాల్లో డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాటు నిర్ణయంచగా దీనిపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులను అడ్డుకోకుండా కొంతమంది నాయకులను పోలీసులు అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేసి కంది మండలంలోని బేగంపేట్ పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. ఇక అదేసమయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డంపింగ్‌యార్డ్ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నించారు. డంపింగ్‌యార్డ్ పనులతోపాటు అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులతో కలసి ఆందోళనకు దిగారు. పోలీసులు ఆందోళనకారులందర్నీ అరెస్టు చేశారు. ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు.

ఎమ్మెల్యే సునీతారెడ్డి అరెస్ట్

ప్యారానగర్ గ్రామంలో ఏర్పాటు చేసే డంపింగ్‌యార్డుతో శివారు ప్రాంతమైన శివ్వంపేట మండలంతోపాటు రాయరావుచెరువు పూర్తిగా కలుషితమవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. డంపుయార్డ్ ఏర్పాటు పనులను వ్యతిరేకిస్తూ అధికారులను నిలదీసేందుకు వెళ్తుండగా నల్లవల్లి వద్ద పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. సునీతారెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నాయకులు ఆదర్శరెడ్డి పలువురు నాయకులను అదుపులోకి తీసుకుని బీడీఎల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వీరందరినీ మధ్యాహ్నం విడిచిపెట్టారు.

డంపింగ్‌యార్డ్ ఇప్పటిది కాదు..

ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు వ్యవహారం ఇప్పటిది కాదని, 2008లో ఈ ప్రక్రియ ప్రారంభమైందని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ తెలిపారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతుండటంతో ఇది వాయిదా పడిందని చెప్పారు. తిరిగి 2015లో అటవీశాఖ నుంచి జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకుందని...2023లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతోనే డంపింగ్‌యార్డ్ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఇక నగర విస్తరణలో భాగంగా పట్టణ శివారు ప్రాంతాలకు నాలుగు వైపులా వ్యర్థాల శుద్ధి నిర్వహణ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని అందులోభాగంగానే ప్యారానగర్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. నగరంలో ఉన్న ప్లాంటులతో పోలిస్తే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లాంటుకు వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు రీసైక్లింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఎటువంటి సందేహాలున్నా తమ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని వెల్లడించారు.

సర్వర్ డౌన్.. రిజిస్ట్రేషన్లు బంద్

రెండురోజులుగా కార్యాలయం చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు



రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయంలో ఎదురుచూస్తున్న ప్రజలు

వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ధరణి యాప్‌ను భూమాతగా మార్చుతున్న నేపథ్యంలో సాంకేతిక సమస్యలతో సర్వర్ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వారం రోజులుగా మందకొడిగా సాగింది. కాగా రెండురోజుల నుంచి పూర్తిగా నిలిచిపోయింది. భూముల రిజిస్ట్రేషన్లకు మీసేవ కేంద్రాల్లో స్లాట్‌లు బుక్ అవుతున్నా తహసీల్దార్ కార్యాలయాల్లో మాత్రం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇబ్బందికరంగా మారింది. దీంతో భూముల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేసుకున్న కొనుగోలుదారులు రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివస్తోంది. ఈ నెల 4న మంగళవారం ఆరుగురు, బుధవారం ఐదుగురు ఇలా రెండు రోజులు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చినా సాయంత్రానికి కూడా ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. రెండురోజులుగా ఉదయం నుంచి ధరణి వెబ్‌సైట్ లాగిన్ అందుబాటులోకి రాకపోవడంతో సాయంత్రం వరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచిచూసి వెళ్లిపోయారు. సర్వర్ పని చేయనప్పుడు స్లాట్‌బుకింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటే ఈ తిప్పలు ఉండేవి కావని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ శంభిరెడ్డి వివరణ కోరగా ధరణి నుంచి భూమాతకు మారుతున్న నేపథ్యంలో వారం, పదిరోజుల నుంచి ధరణి సర్వర్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా నెలకొందని సర్వర్ పని చేయడం ప్రారంభమైతే వెంటనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

గ్రామీణ తాగునీటి సరఫరా చీఫ్ ఇంజినీర్



ఇసోజీపేటలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ఇంజినీర్లు

పుల్‌కల్(అందోల్): వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. పుల్‌కల్ మండలం ఇసోజీపేటలో బుధవారం గ్రామంలో తాగునీటి సరఫరాను పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి తాగునీటి సమస్యలేమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీటిని ఎత్తి పోసే మోటార్లను, పైప్‌లైన్లను సరిచూసుకోవాలన్నారు. అనంతరం హస్నాపూర్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాఘవేందర్, ఈఈలు పాష, నాగభూషణం,డిప్యూటీ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...దేశంలో 15 కోట్ల మంది, రాష్ట్రంలో 40 లక్షల మంది లంబాడీలున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతికి ఐచ్ఛిక సెలవుదినం ఇచ్చిందని, అయితే దీనిని ప్రత్యేక సెలవుగా మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.50 కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కిషన్, ఉమేశ్, సంతోశ్, వినోద్, సికిందర్, నరేశ్,రాజు పాల్గొన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

హత్నూర(సంగారెడ్డి): పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేసి త్వరలో జరుగనున్న పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడంతోపాటు ప్రత్యేక బోధన అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై సమీక్ష చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డును అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు పదోతరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారితో సమాధానాలు రాబట్టారు.



పక్షులు వాలిన చెట్టు

సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పక్షులు సందడి చేస్తున్నాయి. మోడువారిన ఓ చెట్టు కొమ్మలపై గుంపులుగా కూర్చుని కిలకిలరావాలు చేస్తున్నాయి. చెరువులో చేపలను వేటాడుతూ కడుపు నింపుకుంటున్నాయి. ఏదైనా చప్పుడు కాగానే రివ్వున ఎగిరిపోతున్నాయి.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

సహకార ఎన్నికలు లేనట్టేనా!

ఆశావహుల్లో నిరాశ!

- ఈ నెల 15తో ముగియనున్న పదవీకాలం
- సంఘాల్లో కనిపించని ఎన్నికల హడావుడి
- జిల్లాలో మొత్తం 53 పీఏసీఎస్‌లు



సదాశివపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సహకార సంఘాల ఎన్నికలపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిర్ణయం వెలువడకపోవడంతో సదరు ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం లేదనే చర్చ మొదలైంది. ఈ నెల 15తో పీఏసీఎస్‌లు, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పాలకవర్గం గడువు ముగుస్తున్నప్పటికీ, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. దీంతో ఈ సంఘాల్లో ఎన్నికల హడావుడి కనిపించకపోవడంతో స్థానిక ఆశావహులు తీవ్రంగా నిరాశపడుతున్నారు.

వాయిదా పడే అవకాశం!

సాధారణంగా పాలకవర్గం గడువు ముగియడానికి ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాలి. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిర్ణయం వెలువడకపోవడంతో ఎన్నికలు ఇప్పుడప్పుడే జరగనట్టేనని సర్వత్రా చర్చలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికలు కూడా వాయిదా పడే అవకాశం ఉందని స్థానికంగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పలు పార్టీలకు చెందిన నాయకులు చర్చించుకుంటున్నారు.

2020 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలు

జిల్లాలో మొత్తం 53 పీఏసీఎస్‌లున్నాయి. 2020 ఫిబ్రవరి15న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సహకార సంస్థ (డీసీఎంఎస్) చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు జరిగాయి. మరో తొమ్మిది రోజుల్లోగా పాలకవర్గం గడువు ముగుస్తుంది.

నియామకమా?... పొడిగింపా?

సహకార సంఘాలకు ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం కన్పించకపోవడంతో, వాటిని వాయిదా వేసే అవకాశం ఉందని సహకార సంఘాల వర్గాలు భావిస్తున్నాయి. పాలకవర్గాలు పదవీకాలం ముగియనుండటంతో ప్రభుత్వం పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అవకాశం ఉంది. అయితే పర్సన్ ఇన్‌చార్జిలు ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల బాధ్యులను లేదా ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం ఉంది. దీనిపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. మరోవైపు ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల పదవీకాలం గడువు ఆరునెలల వరకు పొడిగించే అవకాశమూ లేకపోలేదని చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నికైన మెజార్టీ పీఏసీఎస్ చైర్మన్లు బీఆర్‌ఎస్‌కు మద్దతుదారులుగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చాలామంది కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించని పక్షంలో పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసే ఆలోచనలో చైర్మన్లు ఉన్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లో ప్రభుత్వం దీనిపై ఓ నిర్ణయానికి రానున్నట్లు నాయకులు చర్చించుకుంటున్నారు.

> **ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం**
>
> పీఏసీఎస్ సంఘాల పాలకవర్గం గడువు ఈ నెల 15తో ముగుస్తుంది. పర్సన్ ఇన్‌చార్జిలా...పదవీకాలం పొడిగింపా అనేది ప్రభుత్వ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పటివరకైతే మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.
>
> –కిరణ్ కుమార్, డీసీవో, సంగారెడ్డి

క్లుప్తంగా

యూత్ పార్లమెంట్ రీజియన్ పోటీల్లో ప్రతిభ

– వర్గల్ నవోదయకు ద్వితీయ స్థానం



జ్ఞాపికను అందజేస్తున్న బీపీ ఆచార్య

వర్గల్(గజ్వేల్): మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా నావోగావ్‌కేరి నవోదయ విద్యాలయ వేదికగా నిర్వహించిన రీజియన్ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో సిద్దిపేట జిల్లా వర్గల్ నవోదయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం రీజియన్ స్థాయి ఫైనల్స్‌లో గుజరాత్ రాష్ట్రం వల్సాడ్ నవోదయ, వర్గల్ నవోదయ విద్యార్థులు వేర్వేరుగా 'యూత్ పార్లమెంట్' కార్యక్రమాన్ని కళ్లకు కట్టారు. స్పీకర్, ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, హోం మంత్రి తదితర పాత్రల్లో జీవించారు. ప్రశ్నలతో నిలదీశారు. తీర్మానాలు ఆమోదించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రెటరీ బీపీ ఆచార్య బుధవారం ఫలితాలు ప్రకటించినట్లు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. వల్సాడ్ ప్రథమ, వర్గల్ ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు ప్రశంసలు దక్కాయని వివరించారు. ఈ సందర్భంగా ఎస్కార్ట్ టీచర్లను, యూత్‌పార్లమెంట్ టీం విద్యార్థులను అభినందించారు.

సుధారాణికి డాక్టరేట్



సుధారాణిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

మెదక్‌జోన్: మెదక్ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం అధ్యాపకురాలు సుధారాణికి రాజస్తాన్‌లోని విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. రాజస్తాన్‌లోని జగదీష్ ప్రసాద్ జబ్బర్మల్ టిబ్రేవాలా విశ్వవిద్యాలయంలో డాక్టర్ నితిక చౌదరి పర్యవేక్షణలో స్టడీ ఆన్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఆర్గానిక్ అండ్ సెమీ ఆర్గానిక్ క్రిస్టల్స్ అండ్ ఇట్స్ గ్రోత్ అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ తిరుమల రెడ్డి, శరత్ రెడ్డి, ప్రణీత్ కుమార్, ఆమనమూర్తి, శ్రీలత, అరుంధతి పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పాత కక్షలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటన కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామంలో చోటు చేసుకుంది. జగదేవ్‌పూర్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బక్కొల్ల యాదయ్య లారీ ఓనర్‌గా ఉండగా, ఇదే గ్రామానికి చెందిన బక్కొల్ల యాదగిరి కూలీ పనులు చేస్తుంటాడు. వీరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు నెలకొన్నాయి. బుధవారం ఇరువురు కలిసి మద్యం తాగుతున్న సమయంలో వాగ్వాదం నెలకొనడంతో పాత కక్షలను మనసులో పెట్టుకొని ఒకరిపై మరొకరు బీరు సీసాలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. జగదేవ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించి పోలీసులు కేసు నమోదు చేశారు.

పలుకే బంగారమాయే



- రికార్డు స్థాయిలో బంగారం
- 10 గ్రాముల ధర రూ.87,500
- పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల ఆందోళన
- జిల్లాలో 80 పైగా దుకాణాలు

పాపన్నపేట(మెదక్): పెళ్లిళ్ల వేళ పసిడి ధర చుక్కలు చూపిస్తుంది. గతేడాది కాస్త తగ్గుముఖం పట్టినట్లు కనిపించడంతో రాబోయేది పెళ్లిళ్ల సీజన్ కావడంతో ముందే కొనేసుకుందాం అని అనుకున్నారు. కానీ పసిడి మాత్రం తగ్గేదేలే అంటూ పెరుగుతూ వస్తుంది. దీంతో శుభకార్యాలకు బంగారం కొనేవారు బెంబేలెత్తిపోతున్నారు. బుధవారం 10 గ్రాముల బంగారం రికార్డు స్థాయిలో రూ.87,500 పలికింది. వెండి ధర 10 గ్రాములకు రూ.970 నమోదు అయ్యింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రికార్డు స్థాయిలో పసిడి పైపైకి..

గత 20 ఏళ్లలో బంగారం, వెండి ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో బంగారం ధర కొండెక్కి కూర్చుంది. దేశీయంగా డాలర్ విలువ రూ.87.36 కావడంతో మన దేశంలో పసిడి మరింత భగ్గుమంటుంది. 2004 ఏప్రిల్ బంగారం ధర 10 గ్రాములు రూ.5,800 ఉంది. 2024 ఏప్రిల్ నాటికి రూ.71,300కు పెరిగింది. కాగా ఫిబ్రవరి 5న నాటికి ఎప్పుడూ లేని రీతిలో రికార్డు స్థాయిలో రూ.87,500 పలికింది. వెండి 10 గ్రాములకు రూ.970 నమోదయ్యింది. గత డిసెంబర్‌లో రూ.72 వేలు, ఈ జనవరిలో రూ.74 వేలు ఉండగా వారం రోజుల్లోనే అమాంతంగా పెరిగింది. జిల్లాలో మెదక్ కేంద్రంగా బంగారం వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇక్కడ సుమారు 80 వరకు బంగారు దుకాణాలు ఉండగా, సీజన్‌లో రోజుకు రూ.కోటి టర్నోవర్ జరుగుతుంది. అయితే ఈ మధ్యలో ధరలు పెరగడంతో గిరాకీ తక్కువగా ఉంటుందని వ్యాపారులు వాపోతున్నారు.



పెళ్లికి కొనలేని పరిస్థితి..

ప్రస్తుతం పెళ్లీళ్ల సీజన్ ప్రారంభంకావడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఇంట్లో పెళ్లి చేస్తే వధువుకు ఎంత లేదన్నా కనీసం 5 తులాల పైగానే బంగారం పెడుతుంటారు. ఈ మధ్యలో మగ పెళ్లివారు కట్నకనుకలు అడుగకుండా మీ అమ్మాయికి ఇంత బంగారం పెడితే చాలు అంటూ తేలిగ్గా చెప్పేస్తున్నారు. దీంతో పెళ్లి కూతురు తరఫున వారు బంగారం ధర చూసి నోరెల్ల బెడుతున్నారు. పెళ్లి ఖర్చుకంటే బంగారానికే ఎక్కువ ఖర్చు అవుతుందని, రూ.లక్షలు పెట్టి కొనలేక వెనక్కి తగ్గుతున్నారు. ఈ సీజన్‌లో పసిడి ధర మరింత పైకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

తలకు మించిన భారం



బంగారం ధరలు ఇలా పెరిగితే ఎలా కొంటాం. ఆడ కూతుళ్ల పెళ్లీళ్లు చేయాలంటే మధ్య తరగతి కుటుంబాలకు తలకు మించిన భారం అవుతోంది. ఈ రోజుల్లో ఎంత లేదన్నా అమ్మాయికి కనీసం 10 తులాలు పెట్టాలి. ఇలా ధరలు పెరిగితే వారి పరిస్థితి ఏంటి. ఈ రోజు రూ.87,500 తులం బంగారం ఉంది. ప్రభుత్వం స్పందించి బంగారం ధరలపై నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– కుకునూరు స్వప్న, గృహిణి, పాపన్నపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: సైబర్ నేరాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించి ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. సైబర్ జాగృక్తి దివస్‌లో భాగంగా బుధవారం సిద్దిపేటలోని ఐటీ టవర్‌లో ఐటీ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్, జంప్డ్ డిపాజిట్, నకిలీ విద్యుత్ బిల్లులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, రుణ యాప్‌ల మోసాలు, ఆన్‌లైన్ పేమెంట్స్, కొరియర్ ఫ్రాడ్స్, ఓటీపీ, నకిలీ వెబ్‌సైట్స్ వంటివి ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సెల్‌ఫోన్ వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అన్ని అనర్థాలు కూడా ఉన్నాయని, సెల్‌ఫోన్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచానికి బీడీ అంటుకొని మంటలు

గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని మంచంతోపాటు కాలి గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గౌరయపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు.. గౌరయపల్లి గ్రామానికి చెందిన లింగయ్య(75) మంగళవారం మంచంలో నిద్రించి అలవాటుగా బీడీ వెలిగించాడు. ప్రమాదవశాత్తు మంచం నిప్పు అంటుకోగా లింగయ్యకు సైతం గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి హైదరాబాద్‌లో ని గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలైన వ్యక్తి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గజ్వేల్‌లో బుధవారం చోటు చేసు కుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన నాయిని కుమారస్వామి(40) ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైద్రాబాద్‌లో నివాసముంటున్నాడు. 2న పని ఉండగా గజ్వేల్‌కు వచ్చిన కుమారస్వామి తిరిగి 3న కారులో బయలుదేరాడు. మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కుమారస్వామికి రెండు కాళ్లు విరిగిపోగా, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సికింద్రాబాద్‌లో ని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుంటలో పడి యువకుడు మృతి

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ములుగు మండలం బండమైలారంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రవణ్‌కుమార్(23) మూడు నెలలుగా బండమైలారంలోని ఓ పరిశ్రమలో పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 3 నుంచి శ్రవణ్‌కుమార్ కనిపించకుండా పోయాడు. కుటుంబీకులు వెతుకుతుండగా బుధవారం అతడు పనిచేసే పరిశ్రమ సమీపంలోని రాణికుంటలో శవమై తేలాడు. కుంటలోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి బావ అమరేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో : ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను గూడ్స్ ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు గోనెమ్మ బస్తీకి చెందిన సందీప్ కుమార్ మంగళవారం బైక్‌పై స్నేహితుడు రమేశ్‌తో కలిసి వెళ్తున్నాడు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వచ్చి గూడ్స్ ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సందీప్ సోదరుడు ప్రదీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. సిరిసిల్లా జిల్లా కేంద్రానికి చెందిన రామకృష్ణ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సొంతూరుకి వచ్చి 4న బైక్‌పై మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. కుకునూరుపల్లి శివారులో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న డీసీఎం అతి వేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రుడిని గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం రామకృష్ణ భార్య దివ్య ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ రాగుల రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

అల్లాదుర్గం(మెదక్): కానిస్టేబుల్‌పై దాడికి యత్నించి, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. వెంట్రావ్‌పేట గ్రామానికి చెందిన బచుపల్లి అంజయ్య తనపై దాడి చేస్తున్నారని మంగళవారం రాత్రి 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అల్లాదుర్గం పోలీస్ కానిస్టేబుల్ నవీన్ కాంత్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అంజయ్య కానిస్టేబుల్ నవీన్ కాంత్‌తో దురుసుగా మాట్లాడి దాడికి యత్నించాడు. ఈ ఘటనపై కానిస్టేబుల్ నవీన్ ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం



వెంకట నవీన్

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సత్యకృప ఎన్‌క్లేవ్‌కు చెందిన వెంకట నవీన్ కన్‌స్ట్రక్షన్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 3న మధ్యాహ్నం జీతం తీసుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా వస్తానని మెసేజ్ చేశాడు. రాత్రి కూడా రాకపోవడంతో ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. నవీన్ తండ్రి మురళీకృష్ణ కుమారుడి కోసం స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విధులకని వెళ్లి వివాహిత..

వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం ఓ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి పటాన్ చెరు డివిజన్ పరిధిలో ఉన్న వాల్యూజోన్‌లో పని చేస్తుండేది. 4న విధులకని ఇంటి నుంచి వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. భర్త ఆమె ఆఫీసుకు ఫోన్ చేయగా విధులకు రాలేదని చెప్పారు. ఇదే స్టోర్‌లో పనిచేసి మానేసిన వెంకట్‌కు భాగ్యలక్ష్మి తాము ఉండే ఇంటి యజమానితో డబ్బులు ఇప్పించిందని, వెంకట్‌పై అనుమానం ఉందని భర్త సిద్దు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట తనిఖీలు నిర్వహించాం. ఆరుగురు పట్టుబడగా సిద్దిపేట కోర్టులో హాజరుపర్చాం. బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.10,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రైతులు సేంద్రియ సాగు చేయాలి



రైతులకు నీమ్ ఆయిల్ పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

కేవీకే శాస్త్రవేత్త శంభాజీ దత్తాత్రేయ నల్కర్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు సేంద్రియ సాగు చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ తెలిపారు. బుధవారం మండలంలోని కేవీకేలో ఎస్సీ సబ్ ప్లాన్‌లో తునికి, రాయిలాపూర్ గ్రామాలకు చెందిన ఎస్సీ రైతులకు యాసంగి వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. 30 మందికి నీమ్ ఆయిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంటలో జింక్ లోపం ఉందన్నారు. ప్రతి రోజూ పంటలను పరిశీలించాలన్నారు. వరి ఆకులపై తుప్పు మరకలు ఉన్నట్లయితే జింక్ సల్ఫేట్ స్ప్రే చేయాలన్నారు. వరి పంటలో పిలకలు ఎక్కువగా వచ్చేందుకు పైపాటుగా ఎకరాకు 30 కిలోల యూరియాతోపాటు 100 గ్రాముల కార్బండిజయ్, మాంకోజెబ్‌తోపాటు మిశ్రమ శిలీంధ్రాన్ని వరి పొలంలో చల్లాలని సూచించారు. సకాలంలో కలుపు నివారణ చేయాలన్నారు. సేంద్రియ ఎరువులు పశువుపేడ, జీవాంమృతం వాడాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య

మునిపల్లి(అందోల్): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ కృష్ణ (45) మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. 3న కృష్ణ భార్య సదాశివపేటలోని ఆమె అక్క ఇంటికి వెళ్లి 4న గ్రామానికి వచ్చింది. ఇంటికెళ్లి చూసేసరికి కృష్ణ ఇంట్లో దూలానికి ఉరేసుకొని కనిపించాడు. జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య మున్నూర్ లక్ష్మి బుదేరా పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేశ్ నాయక్, ఏఎస్ఐ ఏసయ్య తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి..

సిద్దిపేటకమాన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాత్రి రాజు (25) తన భార్యతో కలిసి పట్టణంలోని వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజు భార్య నెల కిందట డెలివరీ కావడంతో పుట్టింట్లోనే ఉంటుంది. అప్పుల బాధ భరించలేక మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): విభజన హామీ ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కోత విధించడాన్ని నిరసిసస్తూ బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ మహిళా సంఘం సభ్యులతో కలిసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బడాబాబుల కడుపు నింపు, మధ్య తరగతి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి రవీందర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శారద, బద్దిపడిగ కృష్ణారెడ్డి, బక్కెల్లి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



జప్తిలింగారెడ్డిపల్లి చెరువులోకి నీటిని విడుదల చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కూడవెల్లి వాగు నుంచి జప్తిలింగారెడ్డిపల్లి తుంగచెరువులోకి వెళ్లే కట్టు కాలువ మరమ్మతు పనులను బుధవారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కాలువ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చెరువులోకి నీరు వెళ్లడం లేదన్నారు. సమస్యను రైతులు తన దృష్టికి తీసుకురాగానే అధికారులతో మాట్లాడి పనులు చేపట్టాలని చెప్పానన్నారు. కాలువ గండ్లును పూడ్చివేసి పేరుకుపోయిన పూడికతీతను మూడు రోజుల్లోగా తొలగించాలని సూచించారు. ఈసందర్భంగా వాగు నుంచి కాలువలోకి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఐబీ డీఈఈ చెన్ను శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నిరంజన్, సత్తయ్య, చంద్రయ్య, కనకయ్య పాల్గొన్నారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

సిద్దిపేటకమాన్: ఫర్నీచర్ షాపులో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని సిద్దిపేట టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సిద్దిపేట-నర్సాపూర్‌కు వెళ్లే దారిలో కొమ్ము ఆంజనేయులు ఓ ఫర్నీచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ముగ్గురు నిందితులు షాపులో ఐరెన్ పైపులను దొంగిలించి ఆటోలో తరలించే క్రమంలో చుట్టు పక్కల వారు గుర్తించి అరిచారు. దీంతో నిందితులు పారిపోయారు. షాపు నిర్వాహకుడు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ పుటేజీ ఆధారంగా ప్రధాన నిందితుడు దుబ్బాకకు చెందిన నూనె స్వామిని గుర్తించాడు. బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పరిశ్రమలో విధులకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- అక్కడికక్కడే కార్మికుడు మృతి



కిరణ్ మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి హత్నూర మండలంలోని కాసాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసాల గ్రామానికి చెందిన పాముల కిరణ్ (35) గుండ్లమాచునూర్ గ్రామ సమీపంలో గల ఎపిటోరియా యూనిట్-9 ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నాడు. రాత్రి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా గ్రామ శివారులో ప్రధాన రోడ్డుపై ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరణ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆస్తి, కుటుంబ తగాదాలతోనే హత్య

- బాబాయ్‌ను చంపిన కుమారుడు
- నిందితుడితోపాటు మరొకరు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: ఆస్తి, కుటుంబ తగాదాల కారణంగా ఓ యువకుడు బాబాయ్‌ని హత్య చేసినట్లు డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శివ్వంపేట మండలం సామ్య తండాలో శనివారం మాలోతు మదన్‌లాల్(42) అనే వ్యక్తిపై కత్తులతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. మృతుడి సోదరి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు నిందితుడితోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. బుధవారం కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం తూప్రాన్‌లోని సీఐ కార్యాలయంలో వెల్లడించారు. శివ్వంపేట మండలం తిక్కదేవమ్మగూడెం పరిధిలోని సామ్య తండాకు మాలోదు మదన్‌లాల్, మాలోదు తారాసింగ్ అన్నాదమ్ముళ్లు. తారాసింగ్ 2016లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీనికి కారణం బాబాయ్ మదన్‌లాల్ అని మృతుడి కుమారుడు భారత్‌సేన్ కక్ష పెంచుకున్నాడు. అలాగే వీరి మధ్య భూ తగాదాలు నడుస్తున్నాయి. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లో నివాసం ఉంటున్న భారత్‌సేన్ ఎలాగైనా బాబాయ్ మదన్‌లాల్‌ను హత్య చేయాలని నిర్ణయించుకొని తన స్నేహితుడు నార్సింగి మండలం జప్తిశివనూర్‌కు చెందిన మ్యాకల్ నవీన్ సాయం తీసుకున్నాడు. శనివారం ఓ కారు అద్దెకు తీసుకొని సామ్య తండాకు చేరుకున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న మదన్‌లాల్‌ను కత్తులతో దాడి చేసి హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ఇద్దరినీ తూప్రాన్ పట్టణ సమీపంలోని కాఫీ డే సమీపంలో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్యకు పాల్పడింది తామేనని ఒప్పుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రంగాకృష్ణ, శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.